క్లుప్తంగా

యూజీడీ సమస్యకు శాశ్వత పరిష్కారం



ఎన్టీఆర్‌కాలనీలో పర్యటిస్తున్న జెడ్సీ రాము, కార్పొరేటర్ లక్ష్మణరావు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి ఎన్టీఆర్‌కాలనీలో జోన్‌-5 కమిషనర్ రాము శుక్రవారం స్థానిక కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావుతో కలిసి విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో ప్రధానంగా యూజీడీ సమస్యలపై చర్చించారు. త్వరలోనే సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని కార్పొరేటర్ లక్ష్మణరావుకు జెడ్సీ రాము హామీ ఇచ్చారు. అదే విధంగా ప్రతి ఇంటికి పన్నులు వేసే విధంగా చర్యలు తీసుకుంటానని చెప్పడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పోరుబాటకు తరలిన నాయకులు



వైఎస్సార్‌సీపీ పోరుబాట కార్యక్రమానికి తరలివెళ్తున్న 40వ వార్డు నాయకులు

సింధియా: చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీ సూపర్ సిక్స్‌లో భాగంగా ప్రతి ఏటా పెట్టుబడి సాయం కింద రైతులకు రూ.20 వేలు ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నిస్తూ రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ శుక్రవారం చేపట్టిన పోరుబాట కార్యక్రమానికి 40వ వార్డు నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మళ్ల విజయ ప్రసాద్ నేతృత్వంలో 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నాయకులు బైక్ ర్యాలీగా వెళ్లి విశాఖ కలెక్టరేట్‌కు చేరుకొని ఆందోళన చేపట్టారు.

మానవ వనరుల బలోపేతమే లక్ష్యం



స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ పాండేను సత్కరిస్తున్న ఎన్ఐపీఎం ప్రతినిధులు

ఉక్కునగరం: హెచ్‌ఆర్ భవిష్యత్తు కేవలం వనరులను నిర్వహించడమే కాదు.. శక్తివంతం చేయడమే ధ్యేయంగా ముందుకు సాగాలని స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) డాక్టర్ ఎస్.సి.పాండే అన్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐపీఎం) వైజాగ్ చాప్టర్, విశాఖ స్టీల్‌ప్లాంట్ సంయుక్తంగా శుక్రవారం ఉక్కు మేనేజ్ మెంట్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో 'హెచ్‌ఆర్‌లో ఎమర్జింగ్ ట్రెండ్స్' అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ప్రజల సామర్థ్యాన్ని వెలికితీయడం హెచ్‌ఆర్ ఉద్దేశ్యమన్నారు. ఈ సందర్భంగా ఆయన తన కెరీర్, అనుభవం నుంచి పలు ఉదాహరణలు తెలియజేశారు. ఎన్ఐపీఎం మాజీ చైర్మన్ ఎస్. సాంబశివరావు ఆధునిక జీవనశైలిలో కుటుంబం ప్రాముఖ్యతను తెలిపారు. సీజీఎం జి. గాంధీ నెట్‌వర్కింగ్‌లో వృత్తిపరమైన సంస్థల పాత్రపై ప్రసంగించారు. హెచ్‌ఆర్ కన్సల్టెంట్, కార్పొరేట్ ట్రైనర్ డాక్టర్ ముత్యాల బాలాజీ, స్టీల్‌ప్లాంట్ డీజీఎంలు ఎ.బద్రీనాథ్, ఆదిశేష నియాక్, హెచ్‌పీసీఎల్ సీనియర్ మేనేజర్ బి.శ్రీకాంత్, ఎన్‌టీపీసీ సీనియర్ మేనేజర్ ఆదిత్య వివిధ అంశాలపై ప్రసంగించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ పాండేను సత్కరించారు. ఎన్ఐపీఎం విశాఖ చాప్టర్ కార్యదర్శి బి. శేషగిరిరావుతో పాటు పలు సంస్థలకు చెందిన 70 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో చేపల చోరీ

వారంతా మత్స్యకార మహిళలు.. కుటుంబాన్ని పోషించుకునేందుకు ఇంటి నుంచి బయటికి వచ్చి కష్టపడుతున్నారు. తెలిసిన వారి వద్ద అప్పులు చేసి మరీ చేపలను కొనుగోలు చేసి, మార్కెట్‌లో విక్రయించి జీవనం సాగిస్తున్నారు. అంతా కష్టపడి తెచ్చుకున్న చేపలను దొంగలెత్తుకుపోతుండడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. తమ వ్యాపారాలకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలోని చేపల మార్కెట్

- వేల రూపాయల చేపలు దొంగలపాలు
- మత్స్యకార మహిళల కన్నీళ్లు
- సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నా ఆగని దొంగతనాలు



రూ.40 వేల చేపలు దొంగతనం జరిగిన షాపు

మల్కాపురం: గంగవరం, మల్కాపురం, శ్రీహరిపురం తదితర ప్రాంతాలకు చెందిన పలువురు మత్స్యకారులు 60వ వార్డు గుల్లలపాలెం, వుడా కాలనీ వద్ద 48 సంవత్సరాల నుంచి చేపలు విక్రయిస్తున్నారు. అప్పట్లో తాత్కాలికంగా గొడుగులు, టార్పాలిన్లు వేసుకుని వ్యాపారాలు సాగించినా.. 2014లో హుద్‌హుద్ తుపాను అనంతరం మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ పక్కన రేకుల షెడ్‌లతో సుమారు 56 షాపులను నిర్మించి వ్యాపారులకు ఇచ్చారు. ఇక్కడి వ్యాపారులు గంగవరం, ఫిషింగ్ హార్బర్, కాకినాడ తదితర ప్రాంతాల నుంచి వేల రూపాయలతో చేపలను కొనుగోలు చేసి, ఇక్కడ రోజూ విక్రయిస్తుంటారు. ఆ రోజు అమ్మకాలు అయిన తరువాత, చేపలను ఐసు బాక్సుల్లో పెట్టి, తమకు కేటాయించిన షాపుల వద్దే ఐసు బాక్స్‌ల్లో భద్రపరుస్తారు. ఆ బాక్సులకు తాళాలు వేసి ఇళ్లకు వెళ్లి, మరుసటి రోజు యథావిధిగా వ్యాపారాలు సాగిస్తుంటారు.

గ్రిల్స్ వేస్తే చోరీలకు చెక్

కొంతకాలంగా వ్యాపారులు రాత్రి సమయాల్లో ఐసు బాక్సుల్లో పెట్టిన చేపలు దొంగలపాలు అవుతున్నాయి. కష్టనష్టాలకోర్చి తెచ్చుకున్న చేపల అమ్మకాలు పూర్తిస్థాయిలో జరగకుండానే దొంగలపాలు అవుతుండటంతో వ్యాపారులు లబోదిబోమంటున్నారు. లాభాలమాట దేవుడెరుగు అప్పులపాలైపోతున్నామంటూ ఆందోళన చెందుతున్నారు. అప్పులు చేసి తెచ్చుకున్న సరకు దొంగతనం జరిగితే తాము జీవించేదెలా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు కేటాయించిన షాపులకు ఇనప గ్రిల్స్ వేస్తే దొంగలు షాపులలో చొరబడే అవకాశం ఉండదని పలుమార్లు అధికారులను, పాలకులను కోరారు. అయినా ఫలితం లేకపోయిందని వాపోతున్నారు.

తరచూ దొంగతనాలు

ఇక్కడ వ్యాపారం సాగిస్తున్న నూకమ్మ అనే మహిళ షాపులో ఐదు నెలల క్రితం రూ.40 వేల చేపలను గుర్తు తెలియని దొంగలు చోరీ చేశారు. అలాగే ఇక్కడ వ్యాపారం సాగిస్తున్న సూరమ్మ అనే వ్యాపారి షాపులో చేపలను దొంగిలించారు. ఇలా పలుమార్లు జరగడంతో సీసీ కెమెరాలు అమర్చినా, దొంగలు ముఖం కనిపించకుండా ముసుగు ధరించి మరీ దొంగతనాలు చేయడంతో వ్యాపారులు లబోదిబోమంటున్నారు. తమ వ్యాపారాలకు రక్షణ కల్పించి, తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

రూ. 40 వేల సరకు దొంగిలించారు



దసరా సమయంలో లక్షల రూపాయలు అప్పు చేసి వివిధ ప్రాంతాల నుంచి మంచి చేపలను తీసుకువచ్చి మా షాపులో పెట్టాను. ఆ రోజు కొంత అమ్మకాలు సాగాయి. మిగిలిన రూ.40 వేల సరకు షాపులో పెట్టి మరుసటి రోజు వచ్చి చూస్తే ఒక్క చేప కూడా కనిపించలేదు. మొత్తం చేపలను దొంగలు తీసుకువెళ్లిపోయారు. దీంతో షాపునకు సీసీ కెమెరా పెట్టించాను. అయిన నెల రోజుల క్రితం మళ్లీ దొంగతనం జరిగింది.

– మద్దు నూకమ్మ, చేపల మార్కెట్ అధ్యక్షురాలు

గ్రిల్స్ వేస్తే రక్షణ



మా షాపుల్లో చేపలను దొంగలు దొంగిలిస్తున్నారు. షాపులకు ఇనప గ్రిల్స్ వేయాలని అధికారులు, పాలకులకు పలు మార్లు విన్నవించాం. ఇప్పటికీ మా సమస్య పరిష్కారం కాలేదు. ఇప్పటికైనా స్పందించి, మా షాపులకు రక్షణ కల్పించండి సారూ..

– కదిరి కాసులమ్మ, చేపల మార్కెట్ ప్రధాన కార్యదర్శి

ఎల్ఐసీ ఏజెంట్ల సంక్షేమానికి ఉద్యమిస్తాం



ధర్నాలో మాట్లాడుతున్న గజపతిరావు

డాబాగార్డెన్స్ : జీవిత బీమా సంస్థలో పనిచేస్తున్న ఏజెంట్ల సంక్షేమానికి ఉద్యమిస్తామని ఆలిండియా లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (లీయాఫీ) చైర్మన్ ఎస్.గజపతిరావు తెలిపారు. ఏజెంట్ల సమస్యల పరిష్కారం కోరుతూ లీయాఫీ సౌత్ సెంట్రల్ జోన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎల్ఐసీ డివిజినల్ కార్యాలయం వద్ద మహాధర్నా నిర్వహించారు. ధర్నాలో పాల్గొన్న గజపతిరావు మాట్లాడుతూ ఏజెంట్లను కాపాడుకోవాల్సిన బాధ్యత సంస్థ యాజమాన్యంపై ఉందన్నారు. ఏజెంట్లకు పాత పద్ధతిలోనే కమీషన్లు కొనసాగించాలని డిమాండ్ చేశారు. పాలసీదారులకు బోనస్ పెంచాలని, ఏజెంట్లకు గ్రూప్ ఇన్సూరెన్స్ వయస్సు పెంచాలని కోరారు. కనీస బీమా రూ.లక్షగా ఏర్పాటు చేయాలని, ఏజెంట్లందరికీ మెడీ క్లెయిమ్ వర్తింపజేయాలని పేర్కొన్నారు. లీయాఫీ సౌత్ సెంట్రల్ డివిజన్ అధ్యక్షుడు బి.తిరుమలరావు మాట్లాడుతూ 68 ఏళ్లగా ఉన్న ఎల్ఐసీ పద్ధతుల్లో మార్పులు తీసుకొచ్చి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. పాలసీపై జీఎస్టీ పెంపు, మెచ్యూరిటీ బోనస్ తగ్గించడం, ఎంట్రీ వయస్సు 50 ఏళ్లకు తగ్గించడం, ప్రీమియం రేట్లు పెంచడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. తక్షణమే నూతన విధానాలను ఉపసంహరించుకోవాలని కోరారు. మహాధర్నాలో జోనల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి డి.శివకుమార్, డివిజినల్ సెక్రటరీ ఎస్‌వీఆర్ వేంకటేశ్వరరావు, డివిజినల్ ట్రెజరర్ వీవీఎస్ కామేష్, జోనల్ ఈసీ మెంబర్ బీవీ రమణ, లీయాఫీ ఈసీ మెంబర్స్ కేవీ రమణ, సీవీ రవికుమార్‌తోపాటు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి సుమారు 1200 మంది ఏజెంట్లు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు పాల్పడిన యువకుడి మృతి

బీచ్‌రోడ్డు: మానసిక పరిస్థితి బాగోలేక ఆత్మహత్యకు పాల్పడిన ఓ యువకుడు శుక్రవారం మృతి చెందాడు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా.. రేసపువానిపాలేనికి చెందిన సురేష్‌కుమార్(29) పుట్టుకతో చెవుడు, మూగ. ఇటీవల కాలంలో అతడి మానసిక పరిస్థితి కూడా బాగోలేదు. దీంతో ఈ నెల 1న ఇంట్లో కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. ఇంట్లో మంటలు రావడంతో తల్లి అప్రమత్తమై ఆస్పత్రికి తరలించింది. చికిత్స పొందుతూ శుక్రవారం సురేష్‌కుమార్ మరణించాడు. ఈ ఘటనపై యువకుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

నేటి నుంచి జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ శ్యాంబాబు

మహారాణిపేట: జిల్లాలో శనివారం నుంచి 20వ తేదీ వరకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ తూర్పు విద్యుత్ సరఫరా పంపిణీ సంస్థ జిల్లా పర్యవేక్షక ఇంజినీరు జి. శ్యాంబాబు విద్యుత్ శాఖ అధికారులతో సమావేశం శుక్రవారం అధికారులతో సమావేశమయ్యారు. జిల్లా ప్రధాన కేంద్రం, డివిజన్ కేంద్రాల్లో ఈ నెల 20న విద్యుత్ పొదుపుపై అవగాహన ర్యాలీలు నిర్వహించనున్నామన్నారు. అలాగే కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఇంధన పొదుపుపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ , చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తామన్నారు. అంతే కాకుండా స్వయం సహాయక మహిళా బృందాలకు ఇంధన సంరక్షణ పద్ధతులు, స్టార్ రేటింగ్ గృహోపకరణాలు ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. విద్యుత్ పొదుపు ఆవశ్యకత,నూతన సాంకేతిక విజ్ఞానం అనే అంశంపై నిష్ణాతులతో ఇంజినీరింగ్ కాలేజీల్లో వర్క్ షాపులు నిర్వహిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జానపద కళాకారులు, జన విజ్ఞాన వేదిక కార్యకర్తలతో ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నామన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సింహాచలం నాయుడు పాల్గొన్నారు.

పుస్తక పఠనంపై విస్తృత ప్రచారం అవసరం

మహారాణిపేట: ప్రస్తుత కంప్యూటర్ యుగంలో పుస్తక పఠనంపై నిర్లక్ష్యం పెరుగుతోందని, దీని నుంచి గట్టెక్కాలంటే విస్తృత ప్రచారం జరగాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ కూటికుప్పల సూర్యారావు అన్నారు. అరసం విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యంలో విశాలాంధ్ర విశాఖ 23వ పుస్తక మహోత్సవ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన కవి సమ్మేళనంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. సమాజంలోని కవులందరూ సామాజిక స్పృహతో మెలగాలన్నారు. డాక్టర్ మాటూరి శ్రీనివాసరావు, కవులు ఎస్.హనుమంతరావు, అడపా రామకృష్ణ, రత్నరాజు, ప్రాన్సిస్, బి.కూర్మారావు, బి.రాధారాణి, సత్యవాడ సోదరీమణులు, కె.వి.ఎస్.మూర్తి కవితలు చదివి వినిపించారు.

ఏయూ వాలీబాల్ జట్టు ఎంపిక



ఏయూ వాలీబాల్ జట్టుతో ఆచార్య విజయమోహన్

విశాఖ విద్య: అంతర్ యూనివర్సిటీ పురుషుల వాలీబాల్ పోటీలు ఈ నెల 18 నుంచి 22 వరకు కేరళలో జరగనున్నాయి. ఆంధ్రా యూనివర్సిటీ నుంచి పాల్గొనే జట్టు క్రీడాకారులను శుక్రవారం ఎంపిక చేశారు. ఏయూ తరపున ఇంటర్ యూనివర్సిటీ కాంపిటీషన్‌కు ఆడే జట్టు సభ్యులను స్పోర్ట్స్ బోర్డ్ డైరెక్టర్ ఆచార్య ఎన్.విజయమోహన్ అభినందించారు. కేరళలో జరిగే పోటీల్లో విజేతలుగా నిలిచి ఏయూ ప్రతిష్టను ఇనుమడింపజేసేలా సిద్ధం కావాలని ఆకాంక్షించారు.

కనక మహాలక్ష్మికి విశేష పూజలు



సిరులతల్లికి క్షీరాభిషేక సేవ

డాబాగార్డెన్స్ : మార్గశిర మాసోత్సవాల 12వ రోజు శుక్రవారం అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం, ప్రత్యేక హోమాలు, అమ్మవారికి సహస్రనామార్చన, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 11 : 30 నుంచి 12 గంటల వరకు పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించారు. అమ్మవారిని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతోపాటు పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.

త్రికాల పంచామృతాభిషేక సేవలో...

అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. మార్గశిర గురువారాల్లో త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనదలచే భక్తులు రూ.7,500, గురువారం మినహా మిగతా రోజుల్లో రూ.2,500 పూజా రుసుము చెల్లించాలి. మధ్యాహ్నం టౌన్ కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో 3 వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, వేద పండితులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులకు చెక్



డ్రైడే-ఫ్రైడేపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ గల్లా చిన్నా

సింధియా: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధుల నుంచి విముక్తి పొందవచ్చునని 63వ వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా అన్నారు. జీవీఎంసీ 63వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం డ్రై డే-ఫ్రైడే ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నా మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి వ్యాధుల నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డ్రైడే-ఫ్రైడేపై ప్రతి ఒక్కరూ అవగాహన ఏర్పరు చుకుని ప్రతి శుక్రవారం, మంగళవారం ఇంట్లో అత్యవసరానికి కావాల్సిన నీటిని ఉంచుకుని, మిగిలిన నీటి పాత్రలను ఖాళీ చేస్తే వ్యాధుల కారక దోమల నుంచి రక్షణ పొందవచ్చునన్నారు. ప్రజలు వ్యర్థాలను తడి-పొడి చెత్తగా ఇంటి వద్దే వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను నిషేధించడం జరిగిందని, ప్రజలంతా నిషేధిత ప్లాస్టిక్‌కు స్వస్తి చెప్పి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్‌కుమార్, ఎస్.ఎస్.జనార్దనరావు, మలేరియా నివారణ ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్, మలేరియా సిబ్బంది, జీవీఎంసీ సిబ్బంది, సచివాయల సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన స్వచ్ఛతా పక్వాడా



డైరెక్టర్ కార్యాలయం వద్ద చెత్త సేకరించిన ఉద్యోగులు



ఎన్ఎస్‌టీఎల్‌లో శ్రమదానం చేస్తున్న ఉద్యోగులు, శాస్త్ర వేత్తలు

గోపాలపట్నం: నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజికల్ లేబరేటరీ (ఎన్ఎస్‌టీఎల్)లో చేపట్టిన స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఉద్యోగులు, శాస్త్ర వేత్తలు, సిబ్బంది పాల్గొని ఎన్ఎస్‌టీఎల్‌లోని పలు ప్రాంతాలను శుభ్రం చేశారు. అంతే కాకుండా సమీప ప్రాంతాలైన బుచ్చిరాజుపాలెం పట్టణ ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రం రహదారులను శుభ్రపరిచారు. ఎన్ఎస్‌టీఎల్ ప్రాంగణంలో 50 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఏర్పాటు చేసిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ ఉద్యోగుల చేత స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌టీఎల్ సివిల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు సునీల్, వర్క్స్‌కమిటీ సభ్యులు అశోక్ చంద్, లెఫ్టినెంట్ కల్నల్ రాహుల్ దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌డీవో ఆధ్వర్యంలో..

డీఆర్‌డీవో పరిధి డైరెక్టర్ జనరల్ (సిస్టమ్స్ అండ్ మెటీరియల్స్) కార్యాలయంలో స్వచ్ఛత పక్వాడా ముగింపు కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. డైరెక్టర్ జనరల్, విశిష్ట శాస్త్రవేత్త ఆర్‌వీ హర ప్రసాద్ మాట్లాడుతూ పలు కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. కార్యాలయం పరిసరాలను శుభ్రం చేయడంతో పాటు ప్లాస్టిక్ వినియోగానికి చెక్ పెట్టినట్టు తెలిపారు.

మేల్కొకుంటే ముప్పే!

ఫోకస్



సింహాచలం రైల్వే స్టేషన్ వద్ద కల్వర్టుపై కుంగిన ఐరన్‌గ్రిల్స్



ప్రమాదకరంగా ఉన్న గ్రిల్స్

గోపాలపట్నం: గోపాలపట్నం రైల్వే స్టేషన్ వద్ద కల్వర్టుపై వేసిన గ్రిల్స్ శిథిలావస్థకు చేరుకున్నాయి. రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో బీఆర్‌టీఎస్ రోడ్డు నుంచి స్టేషన్‌లోకి భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ఇక్కడి ఐరన్ గ్రిల్స్ పాడై ప్రమాదకరంగా తయారయ్యాయి. దీంతో సింహాచలం రైల్వే స్టేషన్‌కు వచ్చిపోయే ప్రయాణికులు గ్రిల్స్‌లో పడి గాయాలపాలవుతున్నారని ఇక్కడి వాపోతున్నారు. పాసింజర్ రైల్లు వచ్చే సమయంలో ఈ రోడ్డు రద్దీగా తయారవుతుందని ఆ సమయంలో ప్రమాదకరంగా ఉన్న గ్రిల్స్‌ను పాదచారులు గుర్తించలేక ప్రమాదాలకు గురవుతున్నారని వాపోతున్నారు.

శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



మధురానగర్ స్కూల్‌లో విద్యార్థితో మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్‌కుమార్

జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్ కుమార్

సీతంపేట : పదో తరగతి ఫైనల్ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించేలా వంద రోజుల యాక్షన్ ప్లాన్‌ను ప్రతి సబ్జెక్టు వారీగా టీచర్స్ సిద్ధం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్ కుమార్ ఆదేశించారు. 25వ వార్డు మధురానగర్‌లో గల జీవీఎంసీ హైస్కూల్‌ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 8:45 గంటలకు హఠాత్తుగా పాఠశాలకు చేరుకున్నారు. పదో తరగతి విద్యార్థులకు జరుగుతున్న స్పెషల్ క్లాస్ గదికి వెళ్లి సబ్జెక్టుల వారీగా సిలబస్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల విషయ నైపుణ్యాన్ని పరిశీలించారు. ప్రతీ విద్యార్థి పదో తరగతి ఫైనల్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని, సబ్జెక్‌లో సందేహాలున్నా తరగతి గదిలో ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టి సంతృప్తి వ్యక్తం చేశారు. చదువు ఆవశ్యకత, విద్యార్థి దశలో టెస్ట్ పరీక్షల ప్రాముఖ్యతను వివరించారు. ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన కౌషల్ క్విజ్ పోటీలో ప్రథమ స్థానం సాధించిన తొమ్మిదో తరగతి విద్యార్థి పి.చరణ్‌కుమార్‌ను డీఈవో అభినందించారు. అనంతరం ఆయన ఉపాధ్యాయులతో సమావేశమై మార్చి నెలలో జరగనున్న టెన్త్ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణతకు వంద రోజుల యాక్షన్ ప్లాన్‌పై చర్చించారు. సమ్మేటివ్ - 1 ప్రశ్నాపత్రాలు స్కూల్ కాంప్లెక్సు పరిధిలో ఉన్న అన్ని పాఠశాలలకు పంపిణీ చేసే విధానాన్ని పరిశీలించారు. పబ్లిక్ ఎగ్జామ్స్ తరహాలో సమ్మేటివ్ నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు శాంతి కుమారి, బి.దేముడుబాబు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎం మహాసభలను జయప్రదం చేయండి

ఆరిలోవ: ఈ నెల 28, 29 తేదీల్లో పెందుర్తిలో జరగనున్న సీపీఎం జిల్లా మహాసభలను ప్రజలు జయప్రదం చేయాలని పార్టీ మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు కోరారు. ఆరిలోవ సీపీఎం కార్యాలయంలో శుక్రవారం మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు, ప్రజా సమస్యలపై సీపీఎం పోరాడుతోందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు గడవకముందే రూ.17 వేల కోట్లు విద్యుత్ చార్జీలు వేసిందన్నారు. ప్రజా సమస్యలపై ఈ సభలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు నరేంద్రకుమార్, శంకరరావు, నాగరాజు, కాంతం, నాయుడు పాల్గొన్నారు.